నగరపాలక పదోన్నతుల్లో లుకలుకలు

- ప్రజాప్రతినిధులు చెప్పిన వారికి పదోన్నతి
- సీనియారిటీని పట్టించుకోని వైనం
- మండిపడుతున్న ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): వడ్డించేవాడు మనవాడైతే ఎక్కడ కూర్చున్నా అన్నీ అందుతాయి అన్న చందాన ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని వివిధ సెక్షన్లలో పదోన్నతులు మారాయి. సీనియారిటీ లేకపోయినా ప్రజా ప్రతినిధుల ప్రాపకం ఉంటే పదోన్నతులు పరుగెత్తుకుంటూ వచ్చేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే సదరు ప్రజా ప్రతినిధులను కాసులతో సంతృప్తి పరిస్తే చాలు ప్రమోషన్ కొట్టేసినట్లే అన్న చందంగా ఏలూరు కార్పొరేషన్ తీరు తయారైంది. దీంతో గత 17 నుంచి 20 సంవత్సరాలు జూనియర్ అసిస్టెంట్లుగా సీనియారిటీ ఉన్నా పదోన్నతులు రాక తమలో తాము పలువురు ఉద్యోగులు మదనపడుతున్నారు. ఇదే సమయంలో తమకన్నా జూనియర్లు అయిన ఉద్యోగులు ప్రజాప్రతినిధుల ప్రాపకంతో అధికారులుగా ప్రమోషన్లు పొంది సెక్షన్ ఆఫీసర్లుగా, సీనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తుండడాన్ని సీనియారిటీ ఉన్న ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. నోరెత్తి ప్రశ్నిస్తే తమపై సదరు ప్రజా ప్రతినిధులు ఎక్కడ కక్ష సాధింపు చర్యలకు పాల్పడతారో? అనే భయాందోళనలతో మౌనంగా నోరెత్తకుండా తమ విధులు నిర్వర్తిస్తున్నారు.

50 మందికి పైగా జూనియర్ అసిస్టెంట్లు

ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని మొత్తం ఎనిమిది విభాగాల్లో వివిధ సెక్షన్లలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కేడర్ ఉద్యోగులు 50 మందికి పైగా ఉన్నారు. వీరిలో 10 మంది వరకు పదోన్నతులు కల్పించాల్సి ఉంది. తాజాగా వీరిలో ముగ్గురికి అధికారులు ప్రమోషన్‌లు కల్పించారు. పేరుకు అధికారులు ఆర్డర్ ఇచ్చినా వెనుక ఉండి నడిపిందంతా ఒక కో–ఆప్షన్ సభ్యుడే అనే విమర్శలు



ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం (ఫైల్)

వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో భారీ మొత్తంలో చేతులు మారినట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి.

ఒక్కో ఉద్యోగి నుంచి రూ.3లక్షల వసూలు?

జూనియర్ అసిస్టెంట్ల పదోన్నతుల్లో ఒక ప్రజా ప్రతినిధి ఒక్కో ఉద్యోగి నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్లు కార్పొరేషన్ మొత్తం గుసగుసలు వినిపిస్తున్నారు. దీంతో సీనియారిటీని సైతం పక్కన బెట్టి సదరు ముగ్గురు జూనియర్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినట్లు చెబుతున్నారు. దీనిపై ప్రశ్నించే ప్రయత్నం చేసిన అధికారులను సైతం తాము చెప్పినట్లు వినకపోతే బదిలీ చేసుకుని వెళ్లిపోండి.. అని బెదిరిస్తున్నట్లు కొందరు అధికారులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్లకు మొండిచేయి

20 ఏళ్లకు పైబడి సీనియారిటీ ఉన్న కొందరు ఉద్యోగులను తోసి జూనియర్లకు పదోన్నతులు ఇవ్వడం పట్ల కార్పొరేషన్‌లో పనిచేస్తున్న మిగతా ఉద్యోగులు ఆశ్చర్యపోతున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో ఎంతో సీనియారిటీ ఉన్న ఒక ఉద్యోగి ప్రమోషన్స్‌లో తొలి పేరు తనదే వస్తుందని ఊహించారు. కానీ ఆయన ఊసే ఎక్కడా లేకపోవడంతో ఆ ఉద్యోగి అవాక్కయ్యారు. ఇదెక్కడి ధర్మం అంటూ మౌనంగా రోధించడం మినహా ఏమీ చేయలేక నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. పరిపాలనా విభాగంలోనూ ఒక ఉద్యోగి సీనియారిటీ ప్రకారం మొదటి వరుసలో ఉన్నారు. ఆయనను సైతం పక్కన బెట్టేశారు. దీంతో ఆ ఉద్యోగి ఏమీ చేయలేక పదోన్నతుల కోసం తాము ముడుపులు ఇచ్చుకోలేము కదా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాట వినని సెక్షన్ అధికారుల మార్పు

కార్పొరేషన్ పరిధిలోని వివిధ సెక్షన్‌లలో అధికారులుగా పని చేస్తున్న కొందరిని తాము చెప్పినట్లు ప్రమోషన్ లిస్టు ఫైనల్ చేయలేదనే కారణంతో సదరు సెక్షన్ ఆఫీసర్లు సరిగ్గా పనిచేయడం లేదు అంటూ అపవాదు వేసి మరీ వారిని పక్కన బెట్టేశారు. తమకు కావాల్సిన వారిని ఆ స్థానంలో కూర్చోబెట్టుకుని తమకు నచ్చిన వారికి పదోన్నతులు కల్పిస్తున్నారు. ఉదాహరణకు రెవెన్యూ విభాగంలో నలుగు ఆర్ఐలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న వారంతా జూనియర్ అసిస్టెంట్ కేడర్ వారే. వీరు గత కొంత కాలంగా ఆర్ఐలుగా చలామణి అవుతున్నారు. వీరిలో ఇద్దరైతే ఎంతో కాలంగా అదే సీటులో పాతుకు పోయారు. ఇలా చెప్పుకుంటూ పోతే కార్పొరేషన్ పరిధిలోని అన్ని విభాగాల్లోనూ నిబంధనలకు పాతరేసి తమకు నచ్చిన వారికి ప్రమోషన్లు కల్పిస్తున్నారంటూ నష్టపోయిన ఉద్యోగులే నేరుగా విమర్శలు గుప్పిస్తున్నారు.

సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్లు

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఇటీవల కాలంలో కల్పించిన పదోన్నతుల వ్యవహారంలో జిల్లా ఉన్నతాధికారులు, మున్సిపల్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని పలువురు ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపితేనే నిబంధనల ప్రకారం సీనియారిటీ ఉన్న ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని వారు భావిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు సేవ చేసేందుకు పోటీ పడాలే తప్ప కాసులు దండుకునేందుకు కాకూడదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

పారదర్శకంగానే ప్రమోషన్లు



నగరపాలక సంస్థలో ఇటీవల చేపట్టిన పదోన్నతుల్లో సీనియారిటీ ప్రకారం, నిబంధనల మేరకు చేశాం. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు. ప్రమోషన్ ఆశించి దక్కని ఉద్యోగుల్లో అసంతృప్తి ఉన్న మాట వాస్తవమే. అయితే ముందుగానే పదోన్నతుల లిస్టును నోటీసు బోర్డులో ఉంచి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరుతున్నాం. ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే సదరు ఉద్యోగికి ప్రమోషన్ కల్పిస్తున్నాం.

ఎ.భాను ప్రతాప్, కమిషనర్, ఏలూరు నగరపాలక సంస్థ

క్లుప్తంగా

అంబేడ్కర్ జయంతిని ప్రశాంతంగా నిర్వహించాలి



అంబేడ్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణపై సూచనలు ఇస్తున్న సీఐ

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం లింగారాగూడెం, కాట్లంపూడి, జాలిపూడి, మాదేపల్లి గ్రామాలలో అంబేడ్కర్ 134 వ జయంతి సందర్భంగా ఏలూరు వన్ టౌన్ సర్కిల్ సిఐ జి.సత్యనారాయణ పలు సూచనలు చేశారు. అంబేడ్కర్ విగ్రహాల వద్ద భద్రత ఏర్పాట్లను , సీసీ టీవీలు పెట్టాలని నిర్వహణ కమిటీకి తెలియజేశారు. ప్రశాంతంగా సంతోషంగా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఎలాంటి ఘర్షణలు చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా నిర్వాహకులు గ్రామస్తులు సహకరించాలని కోరారు. సీఐ వెంట ఎస్సై సీహెచ్‌కే దుర్గాప్రసాద్ ఉన్నారు.

డ్రైవర్లకు పదవీ విరమణ సత్కారం



ఉద్యోగ విరమణ చేసిన డ్రైవర్‌లను సన్మానిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): వివిధ శాఖలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన డ్రైవర్‌లను సన్మానించారు. ఆదివారం ఏలూరులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహనాల డ్రైవర్స్ సంఘ భవనం ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉద్యోగ విరమణ చేసిన డ్రైవర్స్‌కి సన్మానం చేశారు. అనంతరం అధ్యక్షులు తోట శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలు, పెండింగ్‌లో ఉన్న డీఏలు ఇవ్వడంతో పాటు ఐఆర్ వెంటనే ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి ఎస్ఎస్‌వీ శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు జి.ఈశ్వర్రావు, కోశాధికారి మణికంఠ, వైజీఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షలు ప్రశాంతం

భీమడోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పోలసానిపల్లి పరీక్షా కేంద్రంలో ఐదో తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి వేర్వేరు సమయాల్లో ఈ పరీక్షలను నిర్వహించారు. ఐదో తరగతి పరీక్షకు 174 మంది హాజరుకు గాను 162 మంది హాజరయ్యారు. జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్షకు 212 మందికిగాను 182 మంది హాజరయ్యారు.

ఘనంగా పూలే, అంబేడ్కర్ జయంతి సమ్మేళనం



పూలే, అంబేడ్కర్ జయంతి సమ్మేళనంలో పాల్గొన్న అతిథులు, ఉపన్యాసకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జ్యోతిరావు పూలే 198వ జయంతి, బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సమ్మేళనం స్థానిక సీఆర్ రెడ్డి బీఈడీ కాలేజీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, మానవత, యూటీఎఫ్, బోఫ్ సంయుక్త ఆధ్వర్యంలో సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ పూలే అంబేడ్కర్ జీవితాల్లో ఉన్న చదువు ప్రాధాన్యత, ఐక్య పరచడం, క్రమశిక్షణ, పట్టుదల, జ్ఞానం అవసరం నేటి తరం పట్టుకోవాలన్నారు. సెట్‌వెల్ సీఈఓ కేఎస్ ప్రభాకరరావు మాట్లాడుతూ అభివృద్ధి చెందడం అంటే ఒక్కరి అభివృద్ధి కాదని అందరి అభివృద్ధి అని గుర్తించాలన్నారు. డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ జీవితంలో మంచి వాళ్ళుగా ఎదగడానికి అందరూ తోడ్పాడాలన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ ఆచార్యులు డి.అబ్రహం, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వరరావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, గుడిపాటి నరసింహారావు, అలపాటి నాగేశ్వరరావు, మేతర అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం హై స్కూల్ విద్యార్థులు, కాలేజీ విద్యార్థులు, పెద్దలు 25 మంది జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ జీవితాలు, ఆదర్శం గురించి జరిపిన పోటీల్లో పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



మాట్లాడుతున్న ఉక్కుసూరి గోపాలకృష్ణ

ఏలూరు (టూటౌన్): దేశంలో ఓబీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ అని బీసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాల కృష్ణ అన్నారు. స్థానిక అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో బీపీ మండల్ 43వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ ఓబీసీలు 27 శాతం రిజర్వేషన్ పొందుతున్నారంటే మండల్ కృషి ఫలితమేనన్నారు. లక్కోజు రాజగోపాలాచారి, చిదరబోయిన శ్రీనివాసరావు, కిలారపు బుజ్జి పాల్గొన్నారు.

సామ్రాజ్యవాద దేశాల తీరుతో మూడో ప్రపంచ యుద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న కడుపు కన్నయ్య

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సామ్రాజ్యవాద దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఆర్థికపరమైన ఒత్తుడులు చేస్తూ పరోక్షంగా మూడో ప్రపంచ యుద్ధానికి పురిగొలుప్పుతున్నాయని ప్రముఖ వైద్య నిపుణుడు వైఎస్సార్ ప్రసాద్ తెలిపారు. స్థానిక ఏపీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం కపర్ది భవనంలో ఆదివారం సాయంత్రం భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కాఫ్) ఏలూరు జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షుడు కడుపు కన్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చూస్తుంటే మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం 17 మందితో జిల్లా కమిటీ ఎన్నికైంది. గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ వైఎస్ఆర్ ప్రసాద్, అధ్యక్షుడిగా కడుపు కన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా కేజే సత్యనారాయణ తదితరులు ఎన్నికయ్యారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆశ్రం వైద్య కళాశాల సౌజన్యంతో ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్టు నగరానికి చెందిన సామాజిక కార్యకర్త మానేపల్లి రామారావు తెలిపారు. ఈ శిబిరాన్ని నగరానికి చెందిన ప్రముఖ చర్మ వ్యాధుల వైద్యుడు డాక్టర్ డి.సుబ్బారావు ప్రారంభించారు. 285 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. బొలిశెట్టి సురేష్ కుమార్, పిల్లి పండరీనాథ్ సౌకర్యాలు కల్పించారు.

సోలార్ విద్యుత్‌తో బిల్లుల ఆదా



కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ సాల్మన్ రాజు

ఏలూరు (టూటౌన్): ఇంటింటా సోలార్ యూనిట్ల ఏర్పాటుతో కరెంట్ బిల్లుల ఆదాతో పాటు, ఉత్పత్తి చేసిన అదనపు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చని ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఎస్ఈ సాల్మన్ రాజు అన్నారు. ఆదివారం స్థానికంగా టిల్ టవర్స్ సోలార్, రాజ్ ప్రీమియం సోలార్ ప్యానల్స్‌ను రూపొందించింది. దీనికి సంబంధించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాల్మన్ రాజు పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ రాయితీతో పాటు బ్యాంకు రుణ సదుపాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నారా శేషు, రాజనాల రామ్మోహన్ రావు, పి.రాధాకృష్ణ, కేఎం అంబేడ్కర్, పి.అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో జాతీయ స్థాయిలో రాణింపు



ఏలూరు సాయ్ సెంటర్‌లో సాధన చేస్తున్న దివ్య

ఏలూరు రూరల్: సాధారణంగా వెయిట్ లిఫ్టింగ్ అంటే పురుషులు గుర్తుకొస్తారు. భారీకాయులై పెద్ద పెద్ద బరువులు ఎత్తి పతకాలు సాధిస్తారని చెప్పుకుంటారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు సైతం వెయిట్ లిఫ్టింగ్‌పై ఆశక్తి చూపుతున్నారు. పురుషులకు ధీటుగా బరువులు ఎత్తుతున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారు. గతంలో ఒలింపిక్ మెడలిస్ట్ కరణం మల్లీశ్వరి స్ఫూర్తితో ఎందరో మహిళలు వెయిట్ లిఫ్టింగ్‌లో రాణించారు. తర్వాత కొంతకాలం ఈ అంశంలో నిస్తబ్ధత ఏర్పడినప్పటికీ నేడు మళ్లీ బాలికలు వెయిట్‌లిఫ్టింగ్‌పై ఆశక్తి పెంచుకుని శిక్షణ పొందుతున్నారు.

అద్భుత ప్రతిభ

ఏలూరు సాయ్ సెంటర్ శిక్షణ పొందుతున్న పి.దివ్య వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తోంది. ఆమె ఏలూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతోంది. క్రమం తప్పకుండా శిక్షణ చేస్తూ పోటీల్లో పాల్గొని పతకాలు సొంతం చేసుకుంటోంది. గత ఏడాది జరిగిన జూనియర్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ చేజిక్కించుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇదే క్రమంలో సౌత్‌జోన్ యూనివర్శిటీ పోటీల్లో సైతం సిల్వర్ మెడల్ సాధించింది. ఇక పాఠశాల, కళాశాల స్థాయిలో జరిగిన అనేక పోటీల్లో పతకాలు పంట పండించింది.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



మొదట జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలి. తర్వాత దేశానికి ప్రాతినిధ్యం వహించాలి. కామన్‌వెల్త్, ఒలింపిక్‌లో పతకం సాధించాలి. అదే నా జీవిత లక్ష్యం. ఇందుకోసం కోచ్ ఉదయ్‌సందీప్ పర్యవేక్షణలో ప్రతిరోజూ సాధన చేస్తున్నాను. ఫిట్‌నెస్ పెంచుకోవడంతో పాటు టెక్నిట్ పెంచుకుంటున్నాను. – దివ్య, లిఫ్టర్

మహిళలు రాణిస్తున్నారు



ఇటీవల కాలంలో మహిళలు వెయిట్‌లిఫ్టింగ్‌కు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం సాయ్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేసింది. బాలికలు బలం, శరీరక దారుఢ్యం పెంచుకునేందుకు ప్రత్యేక పౌష్టికాహారం అందిస్తున్నాం. వారి కోసం ప్రత్యేక వసతి కల్పిస్తున్నాం. విద్యతో పాటు పోటీల్లో పాల్గొనే సమయంలో ఆర్థిక సాయం సైతం చేస్తున్నాం. శిక్షకుల ద్వారా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం శిక్షణ అందిస్తున్నాం.

డీఎస్‌వీ వినాయక్‌ప్రసాద్, సెంటర్ ఇన్‌చార్జి

ఉత్సాహంగా మట్టల ఆదివారం



జాలిపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం జాలిపూడి ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం చర్చి ఫాదర్ తోట ఆంథోని రాజు ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘస్తులతో పాటు 40 రోజులు దీక్ష చేపట్టిన దీక్షాదారులు ర్యాలీ నిర్వహించారు. ఈత కొమ్మలు అలంకరించి గీతాలు పాడుకుంటూ అన్ని వీధుల్లో ర్యాలీ చేశారు. అనంతరం చర్చిలో ప్రార్థనలు చేశారు. అలాగే పైడి చింతపాడులో బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో ఆదివారం క్రైస్తవులు సంఘ సభ్యులు భారీ ర్యాలీని నిర్వహించారు. పాస్టర్ మధు దగ్గుమల్లి ఆదాము, ముంగర తిమోతి చమళ్ళమూడి మెసక్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న కృష్ణ



అంబేడ్కర్ అవార్డు అందుకుంటున్న గుగ్గులోతు కృష్ణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయుడిగా విద్యా రంగంలోనూ సామాజిక సేవా రంగంలో సుదీర్ఘకాలంగా అందిస్తున్న సేవలను గుర్తించి దక్షిణాది రాష్ట్రాల ప్రైవేటు అధ్యాపకులు, ఉపాధ్యాయుల ఆర్గనైజేషన్ నగరానికి చెందిన గుగ్గులోతు కృష్ణకు బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా పురస్కారం ప్రకటించింది. ఈ పురస్కారాన్ని కృష్ణకు ఆదివారం సాయంత్రం గుంటూరులోని ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల అసెంబ్లీ హాలులో ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు అందుకున్న కృష్ణను ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి, తాళ్లూరి వెంకట రామకృష్ణ, పి.రత్నం బాబు, జి.మోహన్ రావు, టి. శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

16న కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16, బుధవారం కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు ఆ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెదపాటి రామకృష్ణ, గండికోట రాజేష్, కోశాధికారి కేవీ సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో సాయంత్రం 6 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, కళాకారులు హాజరుకావాలని కోరారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం



వివిధ వేషధారణల్లో చిన్నారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని జింగిల్‌బెల్స్ పాఠశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యా, క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ థెరిస్సా కళాశాల ఇంగ్లిష్ హెచ్ఓడీ పి.మాధవి లత, ఆంధ్ర హాస్పిటల్ వైద్యురాలు ఎం.శ్రావణి, పాఠశాల డైరెక్టర్ కె. సురేష్, ప్రిన్సిపాల్ కడియాల విజయలక్ష్మి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-08
వంకాయలు (గులాబీ)	22	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	26	బీన్లచిక్కుడు	70
వంకాయలు (తెలుపు)	24	చామదుంపలు	54
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	38	కంద	00
కాకర కాయలు	28-34	బీట్‌రూట్	28
బీరకాయలు	34	కీరా దోస	30
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	32	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	22	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	26	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	07
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	23
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	11
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	11
ఏలూరు – తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	14
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	14
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	13
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	10
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	11
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	12
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు – తిరుపతి	16.00	4830	29